

# కోరిక

కాటూరు రవీంద్ర - త్రివిక్రమ్

పురజనులకు ప్రత్యేకవార్త!

ప్రపంచ వన్యమృగ సంరక్షణ సలహాదారు శ్రీ జాన్ వైట్ బృందం నగర జంతు ప్రదర్శనశాలను సందర్శించనున్న సందర్భంగా, దున్నపోతును పులి వేటాడే ప్రదర్శన ఉంటుంది. టికెట్ల వెల ఒక్కొక్కరికి పాతిక రూపాయలు, యాభై రూపాయలు, వందరూపాయలు. టిక్కెట్లకై త్వరపడండి. ప్రదర్శన రేపే.

ఇట్లు

ప్రాంతీయ జూ అధికారి

ఆ వాల్‌పోస్టర్‌మీద దున్నపోతు మీద కురుకుతున్న పులిబొమ్మ ముద్రించి ఉంది. వివరాలు చదవగానే, ఎక్కడ తమకా అవకాశం దక్కదోనని, వెర్రిగా టికెట్లకోసం జనం పరుగులు తీశారు.

అరు కౌంటర్లు గంటసేపు పనిచేసి 'హౌస్ ఫుల్' బోర్డులు పెట్టేసాయి. కొందరు బ్లాకెటికెట్లవాళ్లు డబుల్ రేట్లతో లాభం పిండుకోసాగేరు. శక్తి ఉన్నవాళ్లు కొనుక్కున్నారు. లేనివాళ్ళు అక్కడ కావేపు తచ్చాడి, వాల్‌పోస్టర్‌మీద ఉన్న వివరాలు మళ్ళీ మళ్ళీ చదివి కాళ్ళీడ్చుకుంటూ వెనక్కి మరలారు

టిక్కెట్లమీద ప్రదర్శన సమయం— రాత్రి తొమ్మిదిగంటలని రాసింది. దాన్ని పరిశీలనగా చూసినవాళ్ళు రాత్రిపూట ఎందుకు ఏర్పాటు చేసినట్టని చర్చించుకున్నారు. అడవిలో జంతువుల వేట రాత్రిళ్లే జరుగుతుంది గనక సహజత్వం కోసం అలా ఏర్పాటుచేసి ఉండొచ్చని సమాధానపడ్డారు.

టికెట్లు కొన్నవాళ్ళు 'రేపు' కోసం ఎదురుచూడసాగారు.

* * *

శివుడు కూడా రేపు కోసమే ఎదురు చూస్తున్నాడు.

వాడి కెదురుగా పెద్దపులి బోనుంది.

ఆ బోనులోపల ఆకలితో క్రూరత్వం పెంచుకున్న తెల్ల పులి! అది చాలా అపురూపమయిన పులి. ప్రపంచంలోనే ఆ జాతి పులుల సంఖ్య వేళ్ళమీద లెక్కించ

వచ్చు. బెంగాల్ ప్రభుత్వం 'నేషనల్ జూ'కి ఆ పులిని కానుకగా పంపి సంవత్సరం కావస్తోంది. అది వచ్చినదగ్గర్నుంచీ దాని ఆలనాపాలనా శివుడే చూసుకుంటున్నాడు. అలాగనిస్తే అతనికి పులి మచ్చిక అయిందని కాదు! దాన్ని ఒక బోనులోంచి ఇంకో బోనులోకి తరిమి, అప్పుడు నీళ్ళు ఆహారం ఉంచటం, మళ్ళీ ఇటువైపు తరమటం 'జూ' చూడ వచ్చేవాళ్ళు పులిమీదకి రాళ్ళు, రప్పలు విసిరి బెదరకొట్టకుండా కాపలా కాయటం దాని ఆరోగ్యంలో ఏదైనా తేడా గమనిస్తే అధికారులకు వెంటనే తెలియజెయ్యటం– ఇవీ అతని విధులు!

అప్పుడప్పుడు తన జీవితం గురించి ఆలోచించుకుంటూ వేదాంతంగా నవ్వుకునేవాడు శివుడు! మనిషిగా తనకి లేని రక్షణ యీ పెద్దపులికి ఉంది! దీని వంత తిని పెంచడానికి డాక్టర్లు, జంతుశాస్త్రజ్ఞులు పడే తాపత్రయం చూస్తున్నప్పుడు మరో ప్రక్క తన అయిదుగురు పిల్లల తండ్రి అయిన వెంటనే ఇంటా బయటా పోరు భరించలేక ఆపరేషన్ చేయించుకోవటం గుర్తొచ్చేది. సింహాలు లేని అడవుల్లో పులే రాజు. తన శౌర్యాన్ని నిరూపించుకోవటానికి, తన అధికృతని నిలబెట్టుకోవటానికి సాధుజంతువుల్ని వేటాడి రక్తంతో దప్పిక చల్లార్చుకునే పులికీ, మానవత్వం మరచి స్వార్థచింతనే పరమావధిగా బలహీనుల్ని వేటాడి హింసించే దుష్టులకీ రూపంలోనే రూపంలోనే తప్ప స్వభావంలో తేడా ఏమీలేదు. ఈ సత్యం శివుడికి అనుభవపూర్వకంగానే తెలుసు. వాడి తండ్రి ఒకప్పుడు అయిదెకరాల రైతు. విరక్షర కుక్షి అయిన అతడి చేతి వేలిముద్రలతో అంకురించిన అప్పుకాయితం, చేసమీద వచ్చే పటకన్నా రెట్టింపులుగా పెరిగిపోయి చివరకా పొలాన్ని గుటుక్కున మింగేసింది. రైతు కాస్తా కూలీగా మారిపోయాడు.

ఈ సంఘటన శివుడి మనసుని రాయిగా మార్చి ఆ ఘోరస్మృతిని శిలాముద్రగా వేసింది, తండ్రిని ఆకలి పులి తినేసింది తననేదో చదివించి, పెద్దవాణ్ణిగ, గొప్పవాణ్ణిగ చేయాలని. తండ్రి కన్న కలలు కల్లలుగా మిగిలిపోయాయి. తండ్రి చావుతో దిక్కులేనిదయిన కుటుంబం అర్ధాకలితో బ్రతకటానికి తను పని వెతుక్కోక తప్పలేదు అదుగో అప్పుడు 'జూ'లో చెత్త, చెదారం ఎత్తివేసే పని దొరికింది. ఆ పని దొరకటాని కెన్ని పాట్లు పడాల్సొచ్చింది! తండ్రి స్నేహితుడు రంగనాయకులు గట్టిగా పూనుకోబట్టి వచ్చింది. అది కూడ, అతను 'జూ'లో జంతువులకి కాపలాదారుగా పని చేస్తుండబట్టి.



రంగనాయకులు అంత ప్రేమగా తనకి సాయం ఎందుకుచేశాడో తన స్ఫోటకం మచ్చల కూతుర్ని చేసుకోమన్నప్పుడు అర్థమయింది. చేసుకోక తప్పలేదు. కాదనకుండా చేసుకున్నందుకు, తను స్వీపరునుండీ కాపలాదారుగా ఎదిగేవరకు నానా యాతనాపడ్డాడు రంగనాయకులు. ఆ ప్రమోషను కూడ చాలా తమాషాగా వచ్చింది. ఎప్పుడూ ఎంతో అప్రమత్తంగా ఉండే రంగనాయకులు ఒకమాటు హడావుడిన మధ్యగేటు సరిగా పడకపోవటం గమనించకుండా పులికి ఆహారం వేయటానికి వెళ్ళాడు. పులి అతనున్న బోనులోకి వచ్చేసింది. అంతే! ఆ తర్వాత అతన్ని రక్షించటానికి ఎందరో ఎన్నో విధాల ప్రయత్నించారు. కానీ,

వున్నాడు పేపర్లో సంచలనవార్తగా రంగనాయకుల్ని పులి పొట్టనపెట్టుకున్నట్లు రాక తప్పలేదు.

అప్పుడు రంగనాయకులు స్థానంలో శివుణ్ణి నియమించారు అధికారులు. శివుడు పులి బోనులోకి వెళ్లేముందు చాలా బాదస్తంగా మధ్య బోను తలుపు సరిగా పడిందో లేదో చూసి మరీ వెళ్ళేవాడు. అంత జాగ్రత్తగా వెళ్ళినా లోపల చావు భయం వణికిస్తూనే ఉండేది.

మొదట మొదట పులిబోను దగ్గర కాపలా బాగానే ఉండేది. రోజంతా దానికేసే చూస్తూ, దాని కదలికలు, అలవాట్లు పరిశీలిస్తుంటే చక్కటి కాలక్షేపం అవుతుండేది. రానురాను అది కూడ మొహం మొత్తేసింది. దానికేసి చూస్తుంటే ఎవర్నో దారుణంగా హతమార్చి, యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఖైదీని చూస్తున్నట్లనిపించేది.

పాపం. స్వేచ్ఛగా, మహారాజులా అడవిలో ఠీవిగా తిరిగే దీనికి శిక్ష ఏమిటో అని జాలివేసేది.

మరికొన్నాళ్ళకి దాని రాచఠీవి, అందము ముచ్చటగొలిపేవి. ఇన్ని భావాలూ శివుడులోనే కలిగాయి. కానీ, పులి కళ్ళకి అతడు అందుబాటులో లేని ఆహారమే. అది ఎంత ప్రమాదకరమైనదంటే, వచ్చిన కొత్తలో ఒక ఆయోమయపు ఫొటోగ్రాఫరు బోనుదగ్గరగా వెళ్ళి ఫోటో తీస్తుంటే, అమాంతం మీద కొచ్చి పంజాతో అతని కోటు చించేసింది. నయం- ఆ కోటు ఉండబట్టి బ్రతికాడు. లేకపోతే పొట్ట చీల్చేసేదే. కొద్దిగా గోళ్ళు గీరుకున్నాయి. ఆ షాక్‌కి తెలివి తప్పి పడిపోయిన ఫొటోగ్రాఫర్ గంట దాకా కళ్ళు తెరవలేదు. మళ్ళీ అతను అ ఛాయలకొస్తే ఒట్టు. ఈ సంఘటన తలుచుకున్నపుడల్లా శివునికి లావాటి ఆ ఫొటోగ్రాఫరు రూపమూ, అతని భంగపాటు గుర్తొచ్చి తనలో తను తెగ నవ్వేసుకుంటుంటాడు.

"ఏంటయ్యా - వీలో నువ్వు నవ్వుకుంటుండావు?"

ఉలిక్కిపడి చూశాడు.

పెద్దకొడుకు పిచ్చయ్య! చేతిలో క్యారియరుతో తనకేసి వింతగా చూస్తూ నిలబడ్డాడు.

"ఏంలేదులే! ఇయ్యాల ఆలీసం చేసినవేం?" క్యారియరు అందుకుంటూ అడిగేడు.

"ఇంట్లో కూరలేమైనా ఉంటేగా? దొడ్లో నాలుగు తోటకూర కాడలు పీకి, పులుసొండి పంపింది అమ్మ...."

గిన్నెల్లో చూసుకున్నాడు. ఖైదీలకి పెడతారని చెప్పుకునే కూడులాగుంది.

తనకి మాంసంకూర అంటే ఎంతో ఇష్టం! అయిదుగురు పిల్లలతో అలాంటి ఖరీదయిన ఆహారం తినాలంటే అయేపని కాదు. అందుకే కాస్త చవకలో సగం జీవకళ కోల్పోయిన చవకబారు కూరలు కొంటుంటాడు. అదికూడ నెలలో మొదటి పదిహేను రోజులే. ఆ తర్వాత ఏది అందుబాటులో ఉంటే అది తినటమే! పిల్లల ఆకలి చూపులు ఘోరశాపాల్లా అతని మనస్సుని వెంటాడుతూ, వేటాడుతుంటే. తినే అన్నం కూడ ఎక్కేది కాదు. విలాసంగా, సినిమాలో మనుషుల్లా చింతలేని జీవితాలు గడుపుతున్నట్లు కనిపించే మనుష్యుల్ని చూసి స్వర్గ నరకాలు ఇంకెక్కడో లేవు, మన మధ్యే ఉన్నాయనుకునేవాడు.

తెల్లపులి గట్టిగా గాండ్రించింది.

తినటం ఆపి అటు చూశాడు శివుడు.

ఆకలి అవురావురుమంటు అస్థిమితంగా అటు ఇటు తిరుగుతోంది.

తప్పదు. దున్నపోతుకి ఆయువు తీరి యముణ్ణి చేరుకునేవరకు పీకే బాధ తప్పదు అనుకున్నాడు.

"అయ్యా! రేతిరి ఇంటికి రావా?"

"ఏం?"

"అమ్మ అడగమంది."

"ఏమో, ఎట్టఉంటదో! నాకోసం కని పెట్టు కూర్కోవద్దని చెప్పు...."

"అట్టాగే" ఖాళీ గిన్నెలందుకున్నాడు.

* * *

సరిగ్గా తొమ్మిది గంటలు.

'జాన్‌వైట్' బృందం వచ్చి తమ కేర్పాటుచేసిన కుర్చీల్లో ఆసీనులయారు. అప్పటికే ప్రేక్షకుల గ్యాలరీలు క్రిక్కిరిసి ఉన్నాయి. ఎత్తయిన ముళ్ళకంచె కవతల, ఫ్లడ్‌లైట్ల కాంతిలో పొడవైన క్రాటకి దున్నపోతు కట్టివేయబడి ఉండటం కనిపిస్తోంది. రానున్న ప్రమాదం శంకించినట్లు అది భయంగా అటు ఇటు పరుగులుతీస్తూ, బంధం తెంచుకోవటానికి విఫలయత్నాలు చేస్తూ మధ్యమధ్య దీనంగా అరుస్తోంది. పులిని చక్రాలబోనులో తెచ్చి లోపలికి వదలటానికి సిద్ధంగా ఉంచారు. బోను పైకెక్కి, తలుపు పైకి లాగటానికి సిద్ధంగావున్నాడు శివయ్య. జాన్‌వైట్ బృందంలోని ఫొటోగ్రాఫర్లు కెమెరాలు సిద్ధంచేసుకున్నారు. 'సిగ్నల్' అందగానే గేటు ఎత్తేసాడు శివయ్య.

ఒక్కమాటు బోను బయటకి దుమికింది తెల్లపులి.

కాస్త దూరంగా చావుభయంతో గింజుకులాడుతున్న దున్నపోతువైపు చురుగ్గా కదిలింది. పులిని చూస్తూనే దున్నపోతు మరింత బెదిరి కాడు తెంచుకోవటానికి మరింత పెనుగులాడసాగింది.

పులి దాని సమీపానికి వెళుతూనే ఉంది. దున్నపోతు వెనక్కి వెనక్కి వెళుతూ ఒకచోట ఆగిపోయింది. పులి క్రూరంగా చూస్తూ ఏ క్షణంలోనయినా మీద కురక టానికి సిద్ధంగా ఉంది గుర్రుపెడుతోంది. దున్నపోతు, ఎవరూ ఊహించని విధంగా ఒక్కమాటు పులిని ఢీ కొట్టటానికి ముందుకు దూసుకువచ్చింది. మెరుపులా తప్పించుకుని అమాంతం మీదకెక్కి మెడని నోట చిక్కించుకుంది. కొద్ది క్షణాలు అటుయిటూ కదలి కూలిపోయింది దున్నపోతు. తృప్తిగా నెత్తురు పీల్చి, గోళ్ళతో శరీరాన్ని చీల్చి క్షుద్బాధ చల్లారేందుకు కొంత మాంసం మెక్కింది. ప్రేక్షకులీ తతంగమంతా విడ్డూరంగా చూస్తున్నారు. 'జాన్‌వైట్'తో వచ్చిన ఫొటోగ్రాఫర్లు ఫొటోలు తీస్తూనే ఉన్నారు.

* * *

"కోడికూర యాడది?" అన్నం కలుపుకుంటూ అడిగేడు శివుడు.

"గురవయ్య దొడ్లో కోళ్ళకి తెగులొచ్చిందట. అన్నీ సత్తన్నాయని మనకి రెండు పంపాడు" మరికాస్త కూర వేస్తూ అంది రత్తమ్మ.


"గురవయ్య పంపాడా?" తింటం మానేసి ఆశ్చర్యంగా అడిగేడు.

"ఏం అట్టా అడిగావు?"

"అడు.... దొంగలెక్కలు రాసి, బాకీ సెల్లెయ్యమని నడిబజార్లో నన్ను అగమానం సేసినోడు.... ఉత్త పున్నేనికి కోళ్ళు పంపాడా?"

"ఏం.... ఎందుకు పంపడు? బాకీ ఇయ్యాల్నంటే గట్టిగా అడగరా ఏంది? నీ కెప్పుడూ కరువేగా? బాకీలు సెయ్యటమే గానీ తీర్చేదుందా పెట్టేదుందా? సెప్పుకోటానికి ఉజ్జోగం– ఒక్కనాడు పిల్లలుగానీ, నేనుగానీ కమ్మని కూడు తింది లేదు. ఇగ అచ్చటా ముచ్చటా సంగతేమి సెప్పుకోవాలె .... అమ్మా పెట్టదంట అడుక్కు తిననీయదంట, అట్టాగుంది నీ యవ్వారం...." ఈసడింపుగా అంది.

"నీ యమ్మ"– అమాంతం లేచి, జుట్టు పుచ్చుకుని నాలుగు తగలనిచ్చాడు. "మీరు అడుక్కుతింటానికి నేను సచ్చానంటే? నంపుతా నీయమ్మ నోరెత్తావంటే...." అని ఆగ్రహంగా కాళ్ళతో అన్నంగిన్నె అవతలికి తన్ని చేతులు కడిగేసుకుని, 'జూ'కేసి వెళ్ళిపోయాడు. నేరుగా వెళ్ళి పులిబోను దగ్గర కూర్చున్నాడు. మనసంతా అశాంతి. కడుపులో ఆకలి. మాటిమాటికీ పెళ్ళాం ఎత్తిపొడుపు మాటలే గుర్తొస్తున్నాయి, 'ఒక్కనాడు కమ్మని కూడు తిందిలేదు...' బరిసెతో కుళ్ళబొడుస్తున్నట్లు పదునైన మాటలు....




"ఏందికో శివుడో! పులికి మాంసం వేసే వేళయింది గమనించుకోలేదా? ఎల్లు. ఎళ్ళి తెచ్చుకో...." హెచ్చరించాడు తోటి పనివాడు సెంద్రిగాడు. వాడు చిరుతపులుల బోనుదగ్గరుంటాడు. శివుడు మాంసం తేవటానికి వెళ్ళాడు. తిరిగి బోనుదగ్గర కొచ్చేసరికి కొడుకు నిలబడి ఉన్నాడు.

"ఏందిరా?" అన్నాడు.

"నీకు వణ్ణంతెచ్చానయ్యా" వాడి కళ్ళలో నీళ్ళు.

"నా కొద్దురా!"

"లేదయ్యా. అమ్మ పంపలా? నేనే తెచ్చా...."

వాడి ప్రేమకి కరిగిపోయాడు.

"సాలురా అయ్యా! ఆ మాటకే నా కడుపు నిండింది. ఆ వణ్ణం తీసిపారెయ్యి. అందులో మాంసం పడేస్త. అట్టుకెళ్ళి వండించుకు తినండి...."

పిచ్చయ్య గబగబ అన్నం పారేశాడు. దాన్నిండా మాంసం కూరేడు శివుడు.

తన నెవరయినా గమనించారేమోనని అటుఇటు బెరుగ్గా చూసి "రేయ్.... జాగరత్తగా ఎల్లు.... సప్పున పో...." అని తరిమాడు.

పిచ్చయ్య గుండె లరిచేత పట్టుకుని పిరికిగా అడుగులువేస్తూ గేటువైపు నడిచాడు.

భయపడినట్లుగానే అక్కడ అతని వింత వాలకాన్ని చూసి, కాపలావాడు పట్టేసుకుని, టిఫెను మూతతీసి చూసి, తన్నుకుంటూ తీసుకెళ్ళి అధికారిముందు నిలబెట్టాడు.

పులికి ఆహారంవేసి బయటకి రాగానే శివుడిని పై అధికారి దగ్గరకు తీసుకెళ్ళ టానికి మనిషి సిద్ధంగా ఉన్నాడు. విషయం విని, శివుడు బిక్కచచ్చిపోయాడు. జీవితంలో చెయ్యక చెయ్యక చేసిన మొదటి తప్పు! అందుకు శిక్ష తన కొడుకు అనుభవిస్తున్నాడు.

వెళ్ళగానే కొడుకు వంటిమీద పడిన దెబ్బల్నీ, కారుతున్న రక్తాన్నీ చూసి బావురుమన్నాడు "బాబూ! అడి తప్పేం లేదు బాబు. నన్ను కొట్టండి.... చంపండి.... అణ్ణి వదిలెయ్యండి.... ఇన్నాళ్ళబట్టి నాయంగా ఉన్నా బాబూ! ఆకలితో సచ్చిపోతున్న బిడ్డల్ని సూళ్ళేక కక్కుర్తిపడ్డా బాబూ! నన్ను సెమించండి బాబూ .... సెమించండి...." కాళ్ళమీద పడ్డాడు.

బూటుకాలతో తన్ని "దొంగ రాస్కెల్, రోజూ చాటుగా ఎంత మాంసం అమ్ముకుంటున్నావో.... నీలాంటి వాళ్ళని డిస్మిస్ చెయ్యాలి. ఆ పులి ఖరీదెంతో తెలుసురా ఫూల్! అది చచ్చిపోతే లక్షరూపాయలు పెట్టినా రాదురా.... మన 'జూ' కంతా అదే అలంకారం. అలాంటి దాన్ని ఆకలితో చంపుతావురా!" జుట్టు పుచ్చుకుని అటు ఇటు ఊపేడు.

"నిజమే బాబూ! ఆ పులి లచ్చలు పెట్టినా దొరకదుబాబూ .. నాలాంటి ముదనష్టపోడు పైస ఇలువ కూడ సెయ్యడు బాబు.... నన్ను సెమించండి.... ఈ తప్పు కాయండి...."

"నీ సంగతి రేపు పెద్దఅయ్యగారొచ్చి తేలుస్తారు. ఇవాల్టికి వదుల్తున్నా.... నువ్వు డ్యూటీ చెయ్యక్కర్లా. సస్పెండు చేస్తున్నా. ఇంటికి పో...."

తండ్రీ కొడుకులిద్దర్నీ కుక్కల్ని గెంటినట్టు గెంటారు బయటికి.

ఒకరి మొహంలోకి ఒకరు చూసుకోలేకపోతారు. చివరికి పిచ్చయ్యే గొంతు విప్పాడు. "అబ్బ పొద్దోయింది. ఇంటికి వెళదాం పదయ్యా" —

"నే రాన్లేరా.... ఈ ఊసులన్నీ ఎక్కడా సెప్పబాక. నేను రాత్రికి రానని సెప్పు.... నువ్వింటికెల్లు...."

పిచ్చయ్య దిగాలుగా వెళ్ళాడు.

శివుడు అశాంతిగా ఊరంతా తిరిగి, ఎప్పటికో ఇంటిదారి పట్టాడు.

తలుపుమీద చెయ్యి వేయబోయి ఆగిపోయాడు.

లోపల తక్కువస్థాయిలో గురవయ్య గొంతు వినిపిస్తోంది.

ఆశ్చర్యపోయాడు. తన శత్రువు.... తనింట్లో....

భార్య రత్తమ్మ మాటలు కత్తికోతలా వినిపించాయి. "నన్నాసోడు ఆడు మగ వడు, నన్ను సుఖపెట్టడు.... ఎందుకూ అట్టాటోడు ఉన్నా ఒకటే.... పోయినా ఒకటే....అబ్బ.... ఏందదీ....మెల్లగా.... అవతల పిల్లలున్నారు...."

శివుడి చెయ్యి నిస్సత్తువగా వాలిపోయింది. అవమానంతో పోయిన ప్రాణం పోగా, ఉన్న ప్రాణం ఆ మాటలతో హరించుకుపోయినట్లయింది.

అలాగే వెనుతిరిగేడు.

కదులుతున్న శవంలా 'జూ'కేసి నడక సాగేడు.

దారిలో—

దున్నపోతుని వేటాడుతున్న పులి బొమ్మతో ఉన్న పోస్టర్లు వెక్కిరిస్తున్నాయి.

నడుస్తూనే ఉన్నాడు.

మెయిన్‌గేటు కాకుండా మరో దారి లోంచి నేరుగా పులి ఉన్నచోటకి ఎలా వెళ్లొచ్చో బాగా తెలిసిన శివుడు కొద్ది నిముషాల్లోనే అక్కడికి చేరుకున్నాడు. దూరంగా దీపం వెలుగుతోంది. కాంతి మందంగా ఉంది.

పులికి ఆహారం వేయటానికి తను మామూలుగా వెళ్లే గేటు మెల్లగా పైకెత్తి లోపలికి వెళ్లాడు. అది మళ్లీ జర్రున జారి మూసుకుపోయింది. గుడ్డి వెలుగులో ముంగాళ్ల మీద తలవాల్చి పడుకున్న తెల్లపులి, అలికిడికి కళ్లువిప్పి చూసింది. రెండు గోళాల్లా వెలుగుతున్న కళ్లతో తనకేసే చూస్తున్న పులికేసి చూస్తు పిచ్చివాడిలా నవ్వేడు శివుడు.

"దేవుడా? నన్నీసారి తెల్లపులిగా పుట్టించు. నేను దర్జాగా రోజూ మాంసం తినాల.... దున్నపోతుని వేటాడాల.... వద్దు.... యీ దగా మనసుల మద్దెన నన్ను పుట్టించొద్దు...."

పులి తెల్లటికోరలు కనిపించేలా నోరు పెద్దగా తెరిచి గాండ్రించింది.

శివుడు మళ్లీ నవ్వేడు.

"నీ కోరలు చూస్తే నాకేం భయం అనుకున్నావా? దరిద్రం కోరలు కన్నా దగాలమారి మనుసుల కోరలున్నాయి, నీ కోరలే నయ్యం. రా.... యీ మనిసి అంతంసెయ్యి...."

నిర్భయంగా తనవైపు వస్తున్న శివుణ్ణి చూస్తూ, భీకరంగ గర్జిస్తూ ఒక్కసారిగా ఉదుటున లేచి నిలబడి పంజా విసిరింది, తెల్లపులి.